క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



తారక్‌నాథ్‌ను అభినందిస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల: నగర పంచాయతీ కమిషనర్‌గా ఎ. తారక్‌నాథ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారిగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను సిబ్బంది అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి..



నిరసన తెలియజేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, తదితరులు

డెంకాడ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డెంకాడ పీహెచ్‌సీ ముందు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గురువారం నిరసన తెలిపారు. ఆరేళ్లు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 23 శాతం రెమ్యూనరేషన్ పెంచాలని, ఇన్సెంటివ్ మొత్తాలను చెల్లించాలని కోరారు. అలాగే పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సంఘ ప్రతినిధులు అలేఖ్య, పావని, లోకేశ్వరి, సౌజన్య, అరుణ, ఇందిర, భోగాపురం తాలూకా ఏపీఎన్‌జీఓ అధ్యక్షుడు కె.దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు

- ఎస్సై గణేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల: గ్రామాల్లో ధార్మిక కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్సై బి. గణేష్ సూచించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మతపరమైన కట్టడాల పరిరక్షణలో భాగంగా దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద గ్రామ పెద్దలు, యువత సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. ఈ కెమెరాలు నేర నియంత్రణకు దోహదపడతాయని చెప్పారు. అలాగే గంజాయి వినియోగం, విక్రయాలపై దృష్టి సారించి, సమాచారాన్ని పోలీస్‌స్టేషన్‌కు చేరవేయాలని సూచించారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



కార్యక్రమంలో పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా తోపుడు బండిపై పళ్లు అమ్ముకుంటూనే ప్రజల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో తన సొంత నిధులతో చలివేంద్రం ఏర్పాటు చేసిన పట్నాల అభినందనీయుడని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం సమీపంలోని వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్నాల శ్రీనివాసరావు తన తోపుడు బండిపై జిల్లాకు క్యాన్సర్ ఆస్పత్రి కావాలని కోరుతూ.. ఒక బ్యానర్‌ని తగిలించుకుని వ్యాపారం చేయడం గొప్ప విషయమన్నారు. దీనికి తోడు సొంత నిధులతో చలివేంద్రం ఏర్పాటు చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచాడని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకుడు శ్రీనివాసరావు, తోపుడు బళ్ల యజమానులు పాల్గొన్నారు.

కట్టమూరికి కౌముదీ పురస్కారం

విజయనగరం టౌన్: కౌముదీ పరిషత్ సాహిత్య సాంస్కృతిక శాఖ 90వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 18న రింగురోడ్డు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరానికి కౌముదీ పురస్కారం అందజేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పురస్కార మహోత్సవం, సదస్సు ఉంటాయన్నారు. సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు భువన విజయం నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం 50 మంది కవులు, పండితులు, కళాకారులకు సత్కారం ఉంటుందన్నారు. సాహిత్యాభిమానులు, కళాభిమానులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వ్యవస్థలు నిర్వీర్యం..!

- మొన్న వలంటీర్లు.. నేడు సచివాలయాలు..
- సచివాలయాలు.. సిబ్బందిని కుదించే దిశగా ఉత్తర్వులు జారీ
- మిగులు సిబ్బంది సర్దుబాటుకు చర్యలు
- ప్రజలకు అందని ద్రాక్షగా మారనున్న ప్రభుత్వ సేవలు



నగరంలోని వార్డు సచివాలయం

విజయనగరం: మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేసింది. ఇందులో భాగంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. తద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చింది. అయితే కూటమి ప్రభుత్వం క్రమంగా గ్రామ స్వరాజ్యాన్ని నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను లేకుండా చేసింది. సచివాలయ వ్యవస్థను కూడా నీరుగార్చేలా చేస్తోంది. సచివాలయ ఉద్యోగులను కేవలం పింఛన్ల పంపిణీకే పరిమితం చేసి వ్యవస్థనే దెబ్బతీసేలా వ్యవహరిస్తోంది. దీంతో గ్రామ స్వరాజ్యం గాడి తప్పి పాలన అస్తవ్యస్తంగా తయారవుతోంది.

కార్యాలయాల చుట్టూ తిరగకుండా..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మండల కేంద్రానికి దూరంగా ఉండే గ్రామాల ప్రజలు 2019కి ముందు వరకు.. ప్రతి చిన్న సమస్యకూ తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలకు పరుగులు పెట్టేవారు. ఈ క్రమంలో ఎన్నో ఇబ్బందులు పడేవారు. కూలి పని చేసుకునే వారైతే ఆ పనులు మానుకుని రోజంతా కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ పరిస్థితికి చెక్ పెట్టేలా విప్లవా త్మక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం గ్రామీణ ప్రాంత ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు రావాల్సిన పని లేకుండా సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెట్టి సచివాలయ భవనాలు నిర్మించింది. ఇందులో భాగంగా కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్లలో 60 సచివాలయాలు, మండల పరిధిలో మరో 13 సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఈ సచివాల యాల్లో 11 శాఖల అధికారులు అక్కడే ఉండి ఎన్నో సేవలు అందించారు. ఆధార్ కార్డుల మార్పులు చేర్పులు, విద్యార్హత, ఇతర ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వారు వెంటనే సమీపంలో ఉన్న సచివాలయానికి వెళ్తే సకాలంలో అందేవి. సంక్షేమ పథకాలకు సులువుగా దరఖాస్తు చేసుకునే పరిస్థితులు ఉండేవి. ఈ ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

వ్యవస్థలను నిర్వీర్యం చేసేలా...!

సచివాలయ వ్యవస్థను తగ్గించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయంగా కనిపిస్తోంది. రానున్న కాలంలో ఉన్న సచివాలయాల సంఖ్యను 50 శాతానికి తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మూడు కేటగిరిల కింద సచివాలయ వ్యవస్థను మారుస్తూ సిబ్బంది సర్దుబాటుకు ఆదేశాలు ఇవ్వడం అందుకు నిదర్శనంగా నిలుస్తోంది. అందులో భాగంగా ప్రభుత్వం మొత్తం సచివాయాలను మూడు కేటగిరిలుగా విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతమున్న సచివాలయాలను ఏ,బీ,సీ కేటగిరిలుగా విభజించి.. ప్రస్తుతం ఉన్న సిబ్బందిని కుదించి మిగతా వారిని శాఖల వారీగా సర్దుబాటు చేయనున్నారు. రెండు సచివాలయాలు ఒక సెక్టార్ కిందకు తీసుకుని రానున్నారు. ప్రస్తుతానికి ఒక సెక్టార్‌లో రెండు సచివాలయలున్నాయి. ఉద్యోగుల పదోన్నతులు, లేదా సర్దుబాటు వల్ల పోస్టులు తగ్గితే కొన్నాళ్ల తర్వాత సెక్టార్‌లో ఉండే రెండు సచివాలయాలను ఒకటిగా చేసి, రెండింటినీ విలీనం చేయనున్నారు. దీంతో ప్రస్తుతం విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఉన్న 61 సచివాలయాలు రానున్న కాలంలో 30 నుంచి 35 సచివాలయాల తగ్గిపోనున్నాయి.

ప్రజలకు మొదలుకానున్న పాత కష్టాలు..

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రజలకు మరలా పాతకాలం నాటి కష్టాలు ప్రారంభంకానున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. 2500 జనాభా ఉన్న సచివాలయాలకు ఇద్దరు.. 2501 నుంచి 3500 జనాభా వరకు ఉన్న సచివాలయాలకు ముగ్గురు సిబ్బందిని.. అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న సచివాలయాలకు నలుగురు సిబ్బందిని కేటాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సచివాయాల్లో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసులను ఉంచనున్నారు. మిగతావారిని శాఖల వారీగా సర్దుబాటు చేయనున్నారు. పట్టణ ప్రాంతాల్లో అడ్మిన్ కార్యదర్శితో పాటు నలుగురే ఉంటారని తెలుస్తోంది. వార్డు సచివాలయాల్లో కొత్త నియామకాలను చేపట్టకుండా ఉన్న సిబ్బందిని సర్దుబాటు చేయనున్నారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో కూడా సచివాలయల సంఖ్యను దాదాపు 30 శాతం వరకు తొలుత తగ్గించనున్నారు. తర్వాత మరో 8 నెలల కాల వ్యవధిలో ఈ సంఖ్యను 50 శాతం చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది.

> **సచివాలయాల ద్వారా ఉత్తమ సేవలు**
>
> గత ప్రభుత్వం ప్రారంభించిన సచివాలయాల ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని సేవలు సులువుగా లభించేవి. సమీపంలోని సచివాలయానికి వెళితే అక్కడి సిబ్బంది పని పూర్తి చేసేవారు. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే మరలా పాత రోజులే గుర్తుకు వస్తాయి. ఏ పని కోసమైనా రోజుల తరబడి తిరగాల్సి వస్తుందేమో.
>
> – లక్ష్మణరావు, ప్రైవేటు ఉద్యోగి, విజయనగరం.

వార్డు పర్యటన



కార్పొరేషన్ పరిధిలోని 29వ డివిజన్‌లో గురువారం వార్డు పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ కె. అప్పలరాజు, తదితరులు స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఖాళీ స్థలాలలో నిరుపయోగంగా పడి ఉన్న చెత్తాచెదారాలను గుర్తించి, వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. విద్యుత్ దీపాలు, నీటి పంపిణీ విధానం సక్రమంగా చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు.

– విజయనగరం

విద్యార్థుల ప్రతిభ..



పూసపాటిరేగ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి చిత్ర లేఖనం పోటీలో ప్రతిభ చూపించారు. ఈనెల 5వ తేదీన విజయవాడలో డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్స్ అకాడమీ, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ అర్కిటెక్చర్ సంయుక్తంగా నిర్వహించిన పోటీలలో పూసపాటిరేగ విద్యార్థులు 40 చిత్రాలు వేసి పంపించగా వాటిలో ఆరు చిత్రాలకు బంగారు పతకాలు, 8 చిత్రాలకు కాంస్య పతకాలు వరించాయి. అవార్డులకు ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. విజేతలను పాఠశాల హెచ్‌ఎం బి. శంకరరావు, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ఇనపకుర్తి చినసత్యనారాయణతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

– పూసపాటిరేగ

నిరసన..



కొత్తపేట కుమ్మరివీధిలో ఉన్న నగర పాలక శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని కోరుతూ సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి బుగత అశోక్ డిమాండ చేశారు. ఈమేరకు శ్మశానవాటిక వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్మశానంలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయని, స్థలం ఆక్రమణలకు గురవుతోందని చెప్పారు. అంత్యక్రియలు నిర్వహించే సమయంలోనూ ఇబ్బందులేర్పడుతున్నాయని తెలిపారు. అలాగే పట్టణంలోని ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రంగరాజు, ఎ. రాములు, పి.రామకృష్ణ, బి.వాసు, పి.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం గంటస్తంభం

నైపుణ్యాలతో అవకాశాలు..



ముఖ్య అతిథిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం అర్బన్: పరిశ్రమలలో ఉద్యోగావకాశాలకు కేవలం డిగ్రీ చదువులు సరిపోవని.. పనితీరు చూపగల నైపుణ్యాలు ఉండాలని.. ఆ దిశగా అవసరమైన అదనపు కోర్సులు చేయాలని గాయత్రీ విద్యాపరిషత్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రజని అన్నారు. గురువారం స్థానిక సీతం విద్యా సంస్థలోని మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'ధ్రువపత్రాల ఆధిక్యం – ప్రత్యేకత, పురోగతి, విజయం' అనే అంశంపై జరిగిన ఇంటరాక్టివ్ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డిజిటల్ మార్కెటింగ్, ఆర్థిక విశ్లేషణ, ప్రాజెక్ట్ నిర్వహణ, డేటా విశ్లేషణ మొదలైన అంశాల్లో ధ్రువపత్రాల కోర్సులు చేయాలని సూచించారు. సీతం డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ... ఫలితాల ఆధారంగా ముందుకు సాగే ప్రపంచంలో విద్యార్థులు విజయం సాధించాలంటే ధ్రువపత్రాలు తప్పనిసరన్నారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ వరూధిని ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీల అమలుకు డిమాండ్



డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్‌ఎంయూ కార్యకర్తలు

- ఆర్టీసీ ఎన్‌ఎంయూ జిల్లా కమిటీ డిమాండ్

విజయనగరం అర్బన్: ఆర్టీసీ యాజమాన్యం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తాత్సారం వహిస్తోందని, ఇలాగే కొనసాగితే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఆర్టీసీ ఎన్ఎయూ జిల్లా కార్యదర్శి పీజీ రాఫెల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక డిపో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో 38 డిమాండ్లు పరిష్కారానికి యాజమాన్యం అంగీకరించిందని, వెంటనే వాటిని పరిష్కరించాలని కోరారు. అలాగే 1/2019 సర్క్యులర్‌ను అమలు పరచాలని, సీలింగ్ లేని వైద్యవిధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి కె.చంద్రమౌళి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పీఎస్ అప్పడు, గ్యారేజ్ అధ్యక్షుడు పి.గోపి, యు.సంజీవరావు, కె. బంగారాజు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి



వాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రజలు ఆస్తి పన్ను చెల్లించి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. ఆస్తిపన్నుదారులను మరింత చైతన్యపరిచేందుకు వినూత్న రీతిలో క్లాప్ వాహనాలతో పాటు సిబ్బందితో నగరంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అన్నా క్యాంటీన్ వద్ద ప్రారంభమై గంటస్తంభం, కన్యకా పరమేశ్వరి ఆలయం, వెంకటలక్ష్మి జంక్షన్, రైల్వేస్టేషన్, మయూరి జంక్షన్, అంబేద్క జంక్షన్, రింగ్‌రోడ్ ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, సన్ స్కూల్, అల్లూరి సీతారామరాజు విగ్రహం, రైతు బజార్, కల్కి భగవాన్ టెంపుల్, నీళ్లట్యాంక్, అంబటి సత్రం, మూడులాంతర్లు, పైడితల్లి ఆలయం మీదుగా కార్పొరేషన్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి గాను ఇంటి పన్ను, ఖాళీ స్థలముల పన్నులను ఏక మొత్తంలో చెల్లించినట్లయితే 5 శాతం రాయితీ సౌకర్యంతో పాటు.. 2024 – 25 ఆర్థిక సంవత్సరపు బకాయిలను ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించినట్లయితే 50% వడ్డీ మాఫీ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 30వ తేదీలోగా చెల్లించిన వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు. ఆన్‌లైన్ విధానంలో కూడా పన్ను చెల్లించవచ్చని సూచించారు. ప్రజల సౌకర్యార్థం పన్నులు చెల్లించేందుకు కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రన్ ఫర్ జీసస్ రేపు

విజయనగరం టౌన్: విజయనగరం క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆరు గంటలకు కోట వద్ద నుంచి మూడు లాంతర్లు, గంటస్తంభం మీదుగా ఎస్ఎంబీ చర్చి వరకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి సంఘమిత్ర డాక్టర్ ఆర్ఎస్.జాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని చర్చిల ప్రతినిధులు, యువత, మహిళలు, సీనియర్ సిటిజన్లు, సండే స్కూల్ విద్యార్థులు, అన్ని అసోసియేషన్ల ప్రతినిధులతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రైస్తవ విశ్వాసులు, కాపర్లు పాల్గొనాలని కోరారు.

నకిలీ వస్తువుల సీజ్

విజయనగరం క్రైమ్: నగరంలోని పీడబ్ల్యూ మార్కెట్‌లో నకిలీ ఫెవీక్విక్ ప్యాకెట్లు విక్రయిస్తున్న షాప్‌పై విజయనగరం వన్‌టౌన్ పోలీసులు గురువారం దాడి చేశారు. ఢిల్లీకి చెందిన పునీత్ డింగా అనే వ్యక్తి వన్‌టౌన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దాడులు చేపట్టారు. మార్కెట్‌లోని ఓ దుకాణంలో తనిఖీ చేయగా.. 139 ప్యాకెట్లు నకిలీవిగా తేలడంతో ఏడు బాక్సులను సీజ్ చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

వేధింపులు ఆపాలి..

విజయనగరం టౌన్: ఆటో డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలని విజయదుర్గ ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నీలాపు అప్పలరాజు రెడ్డి, రెడ్డి నారాయణరావు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిగ్నల్ జంప్‌లు, ఈ చలానాలు, రాంగ్ పార్కింగ్ పేరుతో ఫైన్‌లు వేస్తున్నారన్నారు. 2007లో ఆర్‌టీఓ, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు ఉమ్మడిగా సర్వే చేసి కేటాయించిన ఆటో పార్కింగ్ స్థలాలను యథావిధిగా కొనసాగించాలన్నారు. అధికారుల తీరును నిరసిస్తూ ఈ నెల 21న ఉదయం పది గంటలకు స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్లందరూ పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు చెన్నా ధర్మారావు, బాలి సన్యాసిరావు, గేదెల నారాయణరావు, టి.శ్రీధర్, కె.రాము పాల్గొన్నారు.

రోడ్డు చూపించి దండుకునే యత్నం..

- ఓ పరిశ్రమ నుంచి డబ్బులు తీసుకునేందుకు టీడీపీ నాయకుల ఆలోచన



గ్రావెల్ రహదారిని చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పూసపాటిరేగ: మండలంలోని కోనయ్యపాలెం నుంచి చింతపల్లి గ్రామానికి వైఎస్సార్‌సీపీ హయాంలో రూ. 20 లక్షల వ్యయంతో రహదారి నిర్మించారు. చౌడువాడ, చింతపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మొంగం నాగబాబు, పబ్బిరెడ్డి అప్పడుదొర అప్పట్లో సుమారు 2.5 కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు వేశారు. అనంతర కాలంలో ప్రభుత్వం మారడంతో ఆ రోడ్డుకు సంబంధించిన బిల్లులు మంజూరు కాలేదు. ఇదిలా ఉంటే ఈ రోడ్డు వల్ల సమీపంలో ఉండే ఓ పరిశ్రమకు మేలు జరుగుతుందని భావించిన టీడీపీ నాయకులు పరిశ్రమ యాజమాన్యాన్ని సంప్రదించి, రోడ్డుకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని కోరగా.. అందుకు యాజమాన్యం కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అయితే విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశ్రమ యాజమాన్యాన్ని కలిసి వైఎస్సార్‌సీపీ హయాంలో తామే రోడ్డు వేసిన విషయాన్ని వివరించారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం డబ్బుల చెల్లింపు విషయంలో పునరాలోచనలో పడినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే వైఎస్సార్‌సీపీ హయాంలో వేసిన రోడ్డును నాయకులు విలేకరులకు గురువారం చూపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొయ్య రామస్వామి, మొంగం శ్రావణ్‌కుమార్, నారాయణ అప్పారావు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం మంజూరు చేయండి

- రామతీర్థసాగర్ కాలువ నిర్వాసితుల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న తారకరామతీర్థ సాగర్ నిర్వాసిత రైతులు

పూసపాటిరేగ: రామతీర్థ సాగర్ రిజర్వాయర్ ఎడమ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే పరిహారం మంజూరు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పూసపాటిరేగలో కాలువ నిర్మాణానికి భూములు కోల్పోయిన ప్రాంతంలో మహంతి జనార్దనరావు ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2023లో పూసపాటిరేగ రెవెన్యూ పరిధిలో 26 మంది రైతుల నుంచి సర్వే నంబర్ 41, 181, 182లో సుమారు 4 ఎకరాలు 75 సెంట్లను కాలువ నిర్మాణానికి ప్రభుత్వం భూసేకరణ చేసి 4,57,64,473 రుపాయలను మంజూరు చేస్తూ అవార్డు పాస్ చేసిందన్నారు. రెండేళ్లవుతున్నా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూసేకరణ చేయడంతో రైతులకు ఎటువంటి క్రయ, విక్రయాలకు అవకాశం లేకుండా పోయిందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు పరిహారం మంజూరు చేయాలని, లేనిపక్షంలో భూములను వెనక్కి ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మహంతి రామకృష్ణ, మహంతి ఆదినారాయణ, మహంతి శ్రీనివాసరావు, ఏకుల గుర్నాథరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వ్యక్తిని శిక్షించాలి

- ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన



మాట్లాడుతున్న రేగాన శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: రౌతలపూడిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని సీతారామునిపేటలో గురువారం ఆయన మాట్లాడుతూ.. సాక్షాత్తూ అంబేడ్కర్ జయంతి రోజున ఇలాంటి అమానవీయ సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి నీచపు పనికి ఒడిగట్టిన నిందితుడ్ని తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అణగారిన వర్గాలు, దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి దోషిని చట్టం ముందు నిలబెట్టాలని డిమాండ్ చేశారు.